ఎసిబికి చిక్కిన నాలుగో కమిషనర్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో ఇప్పటివరకు నలుగురు కమిషనర్లు అవినీతికి పాల్పడుతూ ఎసిబికి చేతికి చిక్కారు. 2013 లో నగర పంచాయతీగా ఏర్పాటవ్వగా 12మంది కమిషనర్లు పనిచేయగా, నలుగురు ఎసిబికి చిక్కారు. దీంతో నగర పంచాయతీలో అక్రమాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో అన్నది తేటతెల్లమవుతుంది. పట్టణ వాసులు కూడా పెదవిరుస్తున్నారు. ఎసిబికి చిక్కిన వారిలో కమిషనర్లు నాగభూషణరావు, కనకరాజు నడిపేన రామారావ,, ప్రస్తుత కమిషనర్ సర్వేశ్వరరావు ఉన్నారు. వీరితో పాటు ఒక కమిషనర్ సస్పెండ్ కూడా అయ్యారు. నగర పంచాయతీ ఏర్పాటైన తర్వాత అభివృద్ధి మాట పక్కన పెడితే అవినీతి అక్రమాలు విచ్చలవిడిగా పెరిగిపోయావని చెప్పవచ్చు.

అనునిత్యం పోరుబాట

ఔను..! ఆ కుటుంబం ప్రజాసేవకు అంకితం..!! ఓవైపు వృత్తికి న్యాయం చేస్తూనే... మరోవైపు సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు పరితపించే మనస్తత్వం వారిది. బహుసా అందుకేనేమో ఆమెతోపాటు తమ్ముడు కూడా ఉపాధ్యాయ ఉద్యమాల్లో చెరగని ముద్రవేసుకున్నారు. చెల్లి సామాజిక కార్యకర్తగా ఉత్తరాంధ్రలో సుపరిచితులు. అన్న ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగి అయినప్పటికీ ప్రగతి శీల శక్తులకు చేతనైన సాయం చేస్తున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం వెలకట్టలేనిది. ఇదే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో నిలిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి కుటుంబ నేపథ్యం. ఉపాధ్యాయ కుటుంబంతో పెనవేసుకుపోయిన బంధం వీరిది.

ఆ కుటుంబం ప్రజాసేవకు అంకితం

- విద్యార్థి దశ నుంచే విజయగౌరి ఉద్యమ బాట
- సోదరుడు శేషగిరి ఉపాధ్యాయ ఉద్యమ నేతగా సుపరిచితులు
- చెల్లెలు రమాదేవి సామాజిక కార్యకర్త
- జెవివి నేతగా భర్త సత్యంనాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయగౌరి స్వస్థలం బొబ్బిలి మండలం రాజుపేట. ఉపాధ్యాయునిగా పనిచేసిన కోరెడ్ల సంజీవినాయుడు, సూర్యకాంతమ్మలకు విజయగౌరి రెండో సంతానం. అన్నయ్య తిరుపతి నాయుడు, చెల్లెలు రమాదేవి ఉన్నారు. తమ్ముడు కీర్తిశేషులు శేషగిరి (గిరిబాబు) ఉపాధ్యాయ ఉద్యమ నేతగా రాష్ట్రంలోనూ, ముఖ్యంగా ఉత్తరాంధ్రలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2021లో శేషగిరి మాస్టారును కరోనా కబలించడంతో ఉపాధ్యాయలోకం విస్తుపోయింది. విజయగౌరి భర్త సత్యంనాయుడు కూడా ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సుదీర్ఘకాలంగా జనవిజ్ఞాన వేదికలో పని చేస్తున్నారు. ఇక విజయగౌరి కుటుంబ విషయాలకు వస్తే... తండ్రి వృత్తిరీత్యా బొబ్బిలి మండలం నారసింహునిపేటలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. దీంతో ఆ గ్రామంలోనే గౌరితోపాటు అన్న, చెల్లి, తమ్ముడు కూడా ఏడో తరగతి వరకు చదువుకున్నారు. తాతగారి ఊరు కూడా అదే కావడంతో పాతికేళ్ల అదే గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉంది.

విజయగౌరి బొబ్బిలి సిబిఎం గర్ల్స్ స్కూలులో 8వ తరగతి చదువుతుండగానే అప్పటికే ఎస్ఎఫ్ఐ నాయకురాలిగా పనిచేస్తున్న భవానితో పరిచయం ఏర్పడింది. అప్పటికే అన్న తిరుపతి నాయుడు కూడా ఎస్ఎఫ్ఐలో కార్యకర్తగా ఉన్నారు. ఈనేపథ్యంలో 10వ తరగతిలోనే ఎస్ఎఫ్ఐ సభ్యత్వం అడిగి మరీ తీసుకున్నారు. ఇదే ఆమె ఉద్యమ భాటకు, సామాజిక సేవకు కీలక మలుపుగా మారింది. సోదరుడు, విజయగౌరి చేపట్టిన కార్యక్రమాలు శేషగిరి ఉద్యమ ప్రస్థానానికి ప్రేరణ కలిగించాయి. మరోవైపు రమాప్రభ కూడా చిన్ననాటి నుంచి సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా చిల్డ్రన్స్ క్లబ్ నడుపుతూ చిన్నారుల్లో వున్న నైపుణ్యాన్ని వెలికి తీయడంతోపాటు ఆటపాటల్లో మేటిగా తయారుచేసే బాధ్యతల్లో ఉన్నారు. ఇలా విజయగౌరిలో చదువు - అధ్యయనం, ఉపాధ్యాయ వృత్తి - పోరాటం జీవితంగా మారాయి.

1996 నుంచి బొబ్బిలి ప్రాంతంలో యుటిఎఫ్ విస్తరణకు విజయగౌరి కృషి చేశారు. యుటిఎఫ్ బొబ్బిలి మండల తొలి కార్యదర్శిగా ఎన్నికైన ఆమె, అనంతరం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర సహాధ్యక్షులుగా, ఎస్టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శిగా పనిచేస్తూ యుటిఎఫ్ ఉద్యమాల్లోనూ, వివిధ ఉపాధ్యాయ సంఘాలను ఐక్యం చేయడంలోనూ కీలకపాత్ర పాత్ర పోషించారు.

ఉపాధ్యాయ వృతిలో చేరాక భారత జ్ఞాన విజ్ఞాన సమితి వేదికలో 1992 నుంచి 1995 వరకు వందలాది గ్రామాల్లో అక్షరాస్యతా శాతం పెంపునకు కోరెడ్ల విజయగౌరి కృషి చేశారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగాను, అక్షరాస్యత ఆవశ్యకత గురించి కొన్ని గ్రామాల్లో మూడు నెలలపాటు 20మంది యువతులతో ప్రచారోద్యమం చేపట్టారు. మరోవైపు సమతా కళాజాత నిర్వహణ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ 1994 నుంచి 1996 వరకు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదిక ఏర్పాటు, సైన్స్ ఉద్యమాన్ని బొబ్బిలి ప్రాంతంలో కీలకంగా నడిపారు. ఈ క్రమంలో 72 గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజన స్థితిగతులు, ఆ ప్రాంతంలోని విద్యారంగ సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ఎనలేని కృషిచేశారు. ఆ ఉద్యమ ఫలితంగా జిల్లాలో మూతపడిన 12 ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరవడంతోపాటు కొత్తగా మూడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి.

కుటుంబ సభ్యులతో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రస్తుతం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా చురుకైన పాత్రపోషిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఉపాధ్యక్షురాలిగా కూడా సేవలందిస్తున్నారు.

యుటిఎఫ్ నాయకురాలిగా ఉపాధ్యాయ సమస్యలపైనా, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు జరిగిన ఉద్యమాల్లో విజయగౌరి పాల్గొన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని, పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులకు, విద్యార్థులకు నష్టం కలిగించే 117జీవో రద్దు కోసం చేపట్టిన పోరాటాల్లో కీలకపాత్ర పోషించారు. కెజిబివి, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. ఈనేపథ్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న విజయగౌరి గెలుపు ద్వారా తమ సమస్యలపై శాసనమండలిలో గళం వినిపిస్తారని వారంతా విశ్వసిస్తున్నారు.

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పి-4 సర్వే పక్కాగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పీ-4 విధానంపై (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్నర్ షిప్) సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. మార్చి 8 నుంచి 28 వరకు ఈ సర్వే చేయాలని సూచించారు. జిల్లాలో 2 లక్షల 65 వేల ఇళ్లు ఉన్నాయని, వ్యవధి తక్కువగా ఉన్నందున ప్రణాళికాబద్దంగా సర్వే పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పి -4)తో ప్రతి ఇంటికి అభివృద్ధిపై జరిగే సర్వేపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాలలో అట్టడుగు స్థాయిలో గల 20శాతం మంది నిరుపేదలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలు, ఎంపిడిఒలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించి, ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్ లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న వారి సహకారంతో అట్టడగు స్థాయిలో ఉంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పి4 విధానం అవలంభించనుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గతంలో నిర్వహించిన ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

వాట్సాప్ గవర్నెన్స్ పై అవగాహన కల్పించాలి

పౌర సేవలు అందించేందుకు దేశంలో తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ తెలిపారు. దీనికోసం అధికారిక వాట్సాప్ నెం. 9552300009 ను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ మొబైల్ నెంబర్ ద్వారా పౌర సేవలు పొందవచ్చన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి మండల, సచివాలయాల్లో వాట్సాప్ ద్వారా పొందే సేవలపై బోర్డులను ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి ధర్మచంద్రారెడ్డి, పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ధోనుబాయి ఆశ్రమ పాఠశాలలో డిడి తనిఖీ

సీతంపేట : మండలంలోని ధోనుబాయి ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ డిడి అన్నదొర సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో ఉన్న బోరు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుకుమార్ డిప్యూటీ వార్డెన్ సుబ్బారావు ఉపాధ్యాయులు ఆర్‌సి రెడ్డి ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

జిసిసియే చింతపండు కొనుగోలు చేయాలి
కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అటవీ ఫలసాయాల్లో భాగంగా గిరిజనుల పండిస్తున్న చింతపండు ధర కేజీ రూ.60 ప్రకటించి గిరిజన సహకార సంస్థ (జిసిసి)యే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జిసిసి బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ కొండచీపుర్లు కిలో రూ.80కు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు అటవీ ఫలాలు సేకరించి అమ్ముతున్న పరిస్థితి గతం నుంచీ ఉందని అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిసిసి అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదన్నారు. కావున జిసిసిల అభివృద్ధికి వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే అటవీ ఫలసాయాలు సేకరిస్తున్నప్పుడు గిరిజనులు ప్రమాదాలకు గురై మృతుచెందుతున్నా ఐటిడిఎ సహకారం ఏ రకంగా కనిపించడం లేదన్నారు. అలాగే శ్రమకు తగ్గ ఫలితం కూడా రావడం లేదన్నారు. నల్లజీడి, నల్లమామిడి, చింతపండు, కొండ చీపురులు జిసిసి నామమాత్రంగానే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ ఏడాది చింతపండు దిగుబడి బాగా తగ్గుముఖం పట్టిందని, కానీ బయట మార్కెట్లో దళారీలు గిరిజనులు తెస్తున్న చింతపండును తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారన్నారు. తాడికొండ, కేదారి పురం, దేరువాడ, నీలకంఠాపురం, మొండెంఖల్ ప్రాంతాల్లో జిసిసి చింతపండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా లక్ష్యాలకు అనుగుణంగా సేకరించడంలేదన్నారు. ప్రతి ఏటా 20వేల క్వింటాళ్ల చింతపండు జిసిసి కొనుగోలు చేస్తామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ 10వేలు, 5 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఒడిశా నుంచి చింతపండు వస్తున్నందున తాము కొనుగోలు చేయలేకపోతున్నామని జిసిసి అధికారులు చెబుతున్నారని అన్నారు. ఇది పచ్చి మోసం, అబద్ధమని పేర్కొన్నారు. గిరిజనులు సేకరిస్తున్న చింతపండుకు రూ.60 ధర ప్రకటించాలని, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని ప్రతి ఏటా ప్రభుత్వానికి విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. అటవీ ఉత్పత్తుల సేకరణ జరుగుతున్నప్పుడు, అటవీ హక్కుల చట్టం అమలులో ఉన్నప్పుడు గిరిజనులు అటవీ ఉత్పత్తులను అమ్మకానికి తీసుకువస్తే ఫారెస్ట్ అధికారులు వేధింపులు, భయభ్రాంతులకు చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. కాబట్టి ప్రభుత్వం వీటన్నింటినీ నిర్మూలించాలని, శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అడ్డు మహేశ్వరరావు, ఎం.సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురంలోని జిసిసి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

సాలూరు రూరల్ : గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని, సేకరించిన పంటలను కొనుగోలు చేయాలని, జిసిసికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక జిసిసి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ జిసిసిలకు నిధులు కేటాయించి బలోపేతం చేసి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. మండలంలోని కురుకూటి, వెలగవలస గ్రామాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభించి సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని కోరారు. పై సమస్యలన్నీ పరిష్కరించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు సీదరపు సుందరరావు, చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం, సాలూరులో యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పిడిఎఫ్‌కు మద్దతుగా బైకు ర్యాలీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి విజయం కోరుతూ సోమవారం సాయంత్రం యుటిఎఫ్ ఆధ్వర్యాన పార్వతీపురం, కురుపాం, సాలూరులో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. విజయగౌరి విజయం ఉపాధ్యాయుల విజయం, పిడిఎఫ్ జిందాబాద్ అంటూ ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, కోశాధికారి కె.మురళి పాల్గొన్నారు.

కురుపాం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరికి మద్దతుగా కురుపాంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ అధ్యక్షతన యుటిఎఫ్, ప్రజా సంఘాలు నాయకుల ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల నుండి ప్రధాన రహదారి మీదగా కాంప్లెక్స్ వరకు ఓట్ ఫర్ విజయ గౌరీ అంటూ నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీరాములు, నాయకులు ఎం.చలపతి, బి.వెంకటరమణ, బి.కరువు, ప్రజాసంఘాల నాయకులు కొల్లి గంగు నాయుడు, మండంగి రమణ, కోలక అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి విజయం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండలతహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని కోరుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.విజయకుమార్, జిల్లా కార్యదర్శి కె.జానకీ రావు, మండల నాయకులు సీతయ్య, సింహాచలం, మన్మధరావు, గణేష్, రాజమణి, కె.లీల పాల్గొన్నారు.

పాలకొండ : నియోజకవర్గమైన పాలకొండలో సీతంపేట రోడ్డు నుంచి పాలకొండ మెయిన్ రోడ్డు దుర్గగుడి మీదుగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరికి మద్దతు కోరుతూ యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యాన బైకు ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు మజ్జి పైడిరాజు, కె.కృష్ణారావు, మండల అధ్యక్షులు కార్యదర్శులు కె.గోవిందరావు, బి.ఫకీరు, ఆనందరావు, నాగేశ్వరరావు, కాంతారావు నియోజకవర్గంలోని యుటిఎఫ్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

శాంతి భద్రతలను పరిరక్షించడంలో ముందు వరుసలో ఉన్న ఆర్మర్డ్ రిజర్వు పోలీసులు విధి నిర్వహణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అలవర్చుకోవాలని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. ఆర్మర్డ్ రిజర్వు పోలీసులకు 8 రోజులపాటు నిర్వహించిన పునశ్చరణ తరగతుల (మొబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం పార్వతీపురం పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ రోజూ ఎఆర్ పోలీసులు నిర్వహించే వివిధ రకాల విధులను, ఆయుధాల వినియోగాన్ని ఈ మొబిలైజేషను ప్రక్రియలో భాగంగా పునశ్చరణ చేసి వాటికి అవసరమైన సాంకేతికతను జోడించామన్నారు. జిల్లా పోలీసు శాఖలో ఎఆర్ విభాగం ముఖ్యమైందని, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖకు వెన్నుముఖగా నిలుస్తుందని అన్నారు. ఎఆర్ పోలీసులు ప్రతీరోజూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తినే ఆహారం, శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర్చుకొనే విధంగా చూసుకోవాలన్నారు. పోలీసులు అందరికి మార్గదర్శకంగా నిలిచే విధంగా ప్రవర్తించాలన్నారు. ఎఆర్ సిబ్బంది, అధికారులకు పెరేడ్ నిర్వహణ, వివిపి సెక్యూరిటి, రక్షణ, ఆయుధాలను ఉపయోగించడంలో మెళకువలు, ఫైరింగ్ ప్రాక్టీసు, బందోబస్తు నిర్వహించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, అత్యవసర పరిస్థుతులలో ఎంఒబి కంట్రోల్ చేయడం, రైట్ గేర్ ఆపరేషను, యోగ వంటి అన్ని రకాల నైపుణ్యాలను పునః సమీక్షించి వాటిలో నిష్ణాతులుగా తీర్చిదిద్దామన్నారు. తమ విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం పెంపొందించేలా ఈ కార్యక్రమం రూపొందించినందుకు ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఆర్ ఎస్ఐలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఎఎస్‌పి అంకిత సురాన, ఐపిఎస్, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఆర్ ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు శిక్షణ పొందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

సూక్ష్మ పరిశీకులదే కీలకపాత్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులది (మైక్రో అబ్జర్వర్లు) కీలకపాత్ర అని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత స్పష్టం చేశారు. జవాబుదారీతనం కలిగి సాధారణ పరిశీలకుల నియంత్రణ, పర్యవేక్షణలో సూక్ష్మ పరిశీలకులు పనిచేయాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. సూక్ష్మ పరిశీలకులు గుర్తించిన అంశాలను సాధారణ పరిశీకులకు సీల్డ్ కవర్లో అందించాలని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల నేపథ్యంలో సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మైక్రోఅబ్జర్వర్లు ఎన్నికల్లో నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. ఈనెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికలను ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడడమే కాకుండా, ఉల్లంఘన జరిగితే, ఆ సమాచారాన్ని సీల్డ్ కవర్లో పెట్టి సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత సూక్ష్మపరిశీలకులపై ఉందన్నారు. ప్రతి పరిశీలకులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలను తూ.చ తప్పక పాటించాలని, కావున ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన చేసుకొని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమంలో సూక్ష్మ పరిశీలకులు విధులు, బాధ్యతలపై మెటీరియల్ ఇప్పటికే అందజేశామన్నారు. దీన్ని క్షుణ్ణంగా పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు రోజు నుంచే సమర్థవంతంగా విధులను నిర్వర్తిస్తూ విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

ఎన్నికల విధులపై అవగాహన తప్పనిసరి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికలపై తప్పనిసరిగా పూర్తి అవగాహన ఉండాలని డిఆర్ఒ హేమలత పిఒ, ఏపీఓలకు ఉద్బోధించారు. పోలింగ్ ప్రక్రియపై పిఒలు, ఎపిఒలు శిక్షణా తరగతులను చక్కగా అన్వయించుకుని, ఎన్నికల విధులను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని అన్నారు. కలెక్టరేట్‌లో పిఒ, ఎపిఒలకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుందని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రిని చెక్‌లిస్ట్‌లో పొందుపర్చిన మేరకు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తెలిపారు. పోలింగ్ సామాగ్రి స్వీకరణ అనంతరం తమ బృందంతో కలిసి నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, సూచనలను పాటిస్తూ బాధ్యతగా నడుచుకోవాలని అన్నారు. చిన్న తప్పిదానికి తావు లేకుండా పూర్తి పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వర్తించాలని హితవు పలికారు. తొలుత బ్యాలెట్ బాక్సుల వినియోగాన్ని పీఓలతో స్వయంగా చేయించారు. శిక్షణ తరగతుల్లో పిఒలు, ఎపిఒలు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న డిఆర్ఒ హేమలత, అధికారులు

ఎంపిడిఒలతో మాట్లాడుతున్న పిఒ యశ్వంత్‌కుమార్

గృహ నిర్మాణాలు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి- సీతంపేట

పిఎం జన్‌మాన్ ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతం చేయడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పాలకొండ నియోజకవర్గంలోని సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలతో సమావేశం నిర్వహించారు. పిఎం జన్‌మాన్ గృహ నిర్మాణాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఇప్పటికీ ప్రారంభం కాని గృహ నిర్మాణాల లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులు కొనసాగిస్తున్న లబ్ధిదారుల బిల్లులను త్వరితగతిన అప్లోడ్ చేసి బిల్లులు చెల్లించాలన్నారు. ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. గృహ నిర్మాణాల పురోగతికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒలు గీతాంజలి, సత్యం, హౌసింగ్ ఎఇ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపి కేంద్రాల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి- సీతానగరం

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల (ఎస్‌డబ్ల్యుపిసి) నిర్వహణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం పెదభోగిలి ఎస్‌డబ్ల్యుపి కేంద్రంలో పంచాయతీ అధికారి కొండలరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో గ్రామాలలో చేపట్టడానికి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తడి చెత్త పొడి చెత్త గ్రామంలోని ప్రజలు ఇంటివద్దనే వేరు చేసి ఇస్తే ఆ చెత్తను క్లాప్ మిత్రాలు ఎస్‌డబ్ల్యుపి కేంద్రాలకు చేరవేసి తడి చెత్త నుండి వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తేరేజమ్మ, డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణం, ఇఒపిఆర్‌డిలు, పెదభోగిలి ఇంచార్జి కార్యనిర్వాహనాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా శిక్షణ కేంద్రం నుండి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షులుగా బోటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన బోటు లక్ష్మీనారాయణను వైసిపి కురుపాం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా నియమిస్తూ ఆ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ మేరకు జియమ్మవలస మండలం చినమేరంగి కోటలో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల పరిధిలో వున్న రైతులు అందరూ వరిసాగు చేస్తున్న భూమి వివరాలు, వ్యవసాయ అనుబంధ శాఖల రాయితీలు, ఇతర పథకాల లబ్ది కోసం రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ విజయభారతి సోమవారం తెలిపారు. ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమదు చేసుకోవాలని దాని ద్వారా పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, విత్తనాలు, ఎరువులు పొందడానికి వీలుంటుందన్నారు. ఈ ప్రక్రియ ఈ నేలా ఆఖరికి పూర్తి చేయాలని అన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణ ప్రధాన రహదారితో పాటు, బందం వారి వీధి, సౌందర్య థియేటర్ వెనుక ఉన్న కాలనీ, బైపాస్ రోడ్డు, బెలగాం పోస్టు ఆఫీస్ వీధి, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు చేస్తున్న పారిశుధ్య నిర్వహణ పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్వతీపురాని స్వచ్ఛ పార్వతీపురం దిశగా ఉండేందుకు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇందులో భాగంగా ప్రతిరోజు అన్ని వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పర్యవేక్షిస్తున్నామని, పట్టణ ప్రజలు తమ వంతు దిశగా స్వచ్ఛ పార్వతీపురం కోసం, తమ చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు బాధ్యత వహించాలని అన్నారు.

'పల్లె పండగ'లో రహదారి అభివృద్ధి జరిగేనా?

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామం నుంచి కత్తుల కవిటి బిటి రహదారికి పల్లె పండగలో అభివృద్ధి జరిగేనా అంటూ మండలంలోని వంకాయల గడ్డ తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు వాపోతున్నారు. చిన్నపాటి చినుకు పడినా రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి పనులు పూర్తయితే కొన్ని గ్రామాలకు అతి సునాయసంగా ప్రయాణం సాగించవచ్చునని, గిరిజనుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలను అనుసంధానం చేయాలంటే ఇటువంటి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతంపేట

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి అని సీతంపేట పోలీసుల ఆధ్వర్యంలో యువతకు సోమవారం సంత మార్కెట్ వద్ద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ సంజీవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచమన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపరాదన్నారు. సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో కొనసాగుతున్న అన్న క్యాంటీన్ మండల టిడిపి అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు ఆహార ప్యాకెట్లను సోమవారం అందజేశారు. గత కొద్ది నెలలుగా ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్ కార్యక్రమం ద్వారా మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం గిరిజన గ్రామాల నుంచి వచ్చిన నిరుపేద గిరిజనులకు అన్నా క్యాంటీన్ ద్వారా ఉచితంగా ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవలు నిమిత్తం దూర ప్రాంతాల నుండి వచ్చిన పేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిన్నింటి ఈశ్వరరావు, దండి మోహన్‌రావు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన వేదాంత ఫేర్‌వెల్ వేడుక

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాల, ఐఐటి-నీట్ అకాడమీ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన కళాశాల ఫేర్‌వెల్ డే సంబరాలు అంబరాన్ని తాకేలా జరిగాయి. కళాశాల జూనియర్, సీనియర్ విద్యార్థినులు పోటీ పడి చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థినులు చేసిన సాంప్రదాయ, గిరిజన థింసా నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చీఫ్ మెంటార్ డాక్టర్ పెంట అప్పారావు, ప్రిన్సిపల్ ఎస్ ఎల్ నాయుడు,డీన్ రమణ బాబు పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని సంగంవలస పంచాయతీ పరిధిలో జరుగుతున్న పలు నిర్మాణ పనులను సోమవారం స్థానిక ఎంపిడిఒ రమణమూర్తి పరిశీలించారు. సంగంవలస, నడిమి, గదబవలసలో ఉపాధి హామీ నిధులతో జరుగుతున్న గోకులాల నిర్మాణాలు, అంగనవాడీ కేంద్రాలకు ప్రహరీ గోడల నిర్మాణాలతో పాటు ఇంకుడు గుంతలు, ఫారం ఫాడ్స్ పనులను, ఆయన పరిశీలించారు. మార్చి నెలాఖరులోగా పనులన్నీ పూర్తి కావాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఇంజనీరు బోర సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే నా అజెండా

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి-భోగాపురం, వేపాడ, జామి

ఉపాధ్యాయుల సంక్షేమం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే తన అజెండా అని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి తెలిపారు. సోమవారం భోగాపురం, జామి, వేపాడ మండలాల్లో ఆమె విస్తృతంగా ప్రచారం చేపట్టారు. భోగాపురం ఉన్నత పాఠశాల, ఎపి మోడల్ స్కూల్, రావాడ, పోలిపల్లి ఉన్నత పాఠశాలల్లోను, జామి జెడ్‌పి ఉన్నత పాఠశాల, వేపాడ మండలంలో కెజిబివి, ఆదర్శ పాఠశాల, గురుకులంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, బొద్దాం, సోంపురం ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను, ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని, కచ్చితంగా వాటి పరిష్కారానికి తనవంతు సాయశక్తులా కృషి చేస్తానని హామీఇచ్చారు.

అవకాశమిస్తే ఉపాధ్యాయుల గొంతునవుతా

ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే విధాన మండలిలో ఉపాధ్యాయుల గొంతును వినిపిస్తానని విజయగౌరి అన్నారు.

వేపాడ: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయగౌరి

ఉపాధ్యాయుల సమస్యలపై గత కొన్నేళ్ల నుంచి పోరాటం చేస్తున్నానని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలను దగ్గర నుంచి చూసిన తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతానని అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వాన్ని నిలదీయని వారికి ఓటు వేసి గెలిపించినా ఉపయోగం లేదన్నారు. గతంలో పనిచేసిన వారంతా సమస్యను గాలికి వదిలేసి ప్రభుత్వాలకు అనుగుణంగా ఉండడంతో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల గొంతు రాష్ట్రంలో వినిపించ లేదని అన్నారు. విద్యారంగంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల విద్యా శాఖలో అపారమైన నష్టం జరిగిందని అన్నారు.

మొదటిసారిగా పెద్దల సభకు ఒక మహిళగా ప్రాతినిధ్యం చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ ఓటర్లంతా విజయగౌరికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, వేపాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిన్నింటి వెంకటరమణ, ఇమంది జగదీశ్వరరావు, కోశాధికారి పి.చిరంజీవి, సీనియర్ నాయకులు ఎస్‌విఎన్ స్వామి, డి.జగదీష్, ప్రసాద్, సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్, భోగాపురం యుటిఎఫ్ నాయకులు పి.చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వైకుంఠరావు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ మోడ్‌లో పిఎం సూర్యఘర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను మిషన్ మోడ్‌లో చేపట్టాలని ఎంపిడిఒలు, విద్యుత్‌శాఖ ఎఇలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గృహ నిర్మాణం, పిఎంఎస్‌జెవై, ఉపాధిహామీ, ఎంఎస్‌ఎంఇ, వైద్యఆరోగ్యం, పిజిఆర్‌ఎస్ తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్య ఘర్ ప్రయోజనాల దృష్ట్యా ఎక్కువ యూనిట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 3 కెవి యూనిట్‌కు రూ.2 లక్షలు అవుతుందని, దీనిపై గృహ యజమానులకు అవగాహన కల్పించాలని తెలిపారు. దరఖాస్తు చేసిన వెంటనే రుణ సమస్య లేకుండా బ్యాంకర్లతో మాట్లాడాలని సూచించారు. వచ్చే వారానికి ప్రగతి కనబర్చని ఎంపిడిఒ, ఎఇలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఉద్ఘాటించారు. జిల్లాలో పిఎం జన్ మన్ క్రింద 5441 గృహాలు,

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పిఎంఎవై కింద నిర్దేశించిన లక్ష్యంలో 4219 ఇళ్ల త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఉపాధిహామీ కింద చేపడుతున్న 2024 ఫారం పాండ్స్ గతంలో మంజూరు చేయడం జరిగిందని, వాటితో పాటు ఫిష్ పాండ్స్, కాంపౌండ్ వాల్స్ పనులను ఈనెల 28లోగా పూర్తి చేయాలని అన్నారు. పూర్తి చేసిన పనులకు ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. ఎంఎస్‌ఎంఇ సర్వేలో కురుపాం, కొమరాడ మండలాలు శత శాతం పూర్తిచేసినందుకు అభినందనలు తెలిపారు. సాలూరు, గరుగుబిల్లి మండలాలు శత శాతానికి దగ్గరగా ఉన్నాయని, మిగిలిన మండలాలు కూడా వేగవంతం చేసి శత శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 69 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని, ఏ కేంద్రంలోనైనా సమస్యలు తలెత్తితే తక్షణమే వాటిని పరిష్కారం చేయిస్తామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులపై తక్షణమే చర్యలు తీసుకొని, పరిష్కరించాలని సూచించారు. వెక్టార్ హైజిన్ యాప్ కచ్చితంగా వినియోగించాలని అన్నారు. సమావేశంలో కెఆర్‌ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు పి ధర్మచంద్రారెడ్డి, ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావుతో పాటు పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిరిమానుకు మాజీ మంత్రి పూజలు

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ గ్రామదేవత పండుగ నేపథ్యంలో సిరిమాను చెట్టుకు సోమవారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పూజలు నిర్వహించారు. మే 18,19,20 తేదీల్లో శ్యామలాంబ పండుగ నిర్వహించనున్నారు. సిరిమాను చెట్టును ఆదివారం పట్టణమంతా ఊరేగింపు చేశారు.మాజీ మంత్రి రాజన్నదొర సిరిమాను చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవత పండుగను సంస్కృతి, ఆచారం, సంప్రదాయాలకు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు జి.నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పువ్వల నాగేశ్వరరావు,పిరిడి రామకష్ణ పాల్గొన్నారు.

పెదపెంకిలో చలివేంద్రం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ గ్రామ పెద్ద టిపిఆర్ పట్నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ వేసవి అంతా ఈ చలివేంద్రాన్ని నడపాలని ప్రధాన రహదారిపై ఉన్న ఈ చలివేంద్రాన్ని పలువురు వ్యవసాయ కూలీలకు, బాటసారులకు, ప్రయాణికులకు దాహం తీర్చేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ చలివేంద్రానికి మజ్జిగను నేతాజీ గ్రంథాలయాలకు చెందిన యువకుడు గొర్రెల శ్రావణ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవినాయుడు, గ్రామపెద్దలు పెనుబోతు దుర్గా ప్రసాద్, పాతేటి లోకేష్, పెంకి బలరాంనాయుడు, కోట గౌరీనాథ్, పెంకి పరశురాం, కర్రి సతీష్, పెనుబోతు భాస్కర్, గుల్లిపల్లి రవి, తేజ, ఈర్ల మధు, నేరల్లా భూషణరావు, కొల్లి నారాయణరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి- పాచిపెంట

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం మండలంలో పక్కాగా అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఇసుక సరఫరా ట్రాక్టర్ యాజమాన్య, భవన నిర్మాణ కార్మికులు మజ్జి వెంకట్రావు, నడిపల్లి ధనరాజ్, ఎం పాపారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని మండలంలో ఏ ఇసుక రీచ్ వద్దనుండైనా ఉచితంగా ఇసుక తరలించుకునేందుకు అనుమతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వీరికి మద్దతుగా సిఐటియు నాయకులు కొరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మండలంలో అన్ని ఇసుక రీచ్‌ల వద్ద నుండి మండల కేంద్రంలో గల ట్రాక్టర్ యజమానులు భవన నిర్మాణాలకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఉచిత ఇసుక సరఫరా చేసుకునే విధంగా తహశీల్దార్ పర్యవేక్షణలో అనుమతులు జారీ చేయాలన్నారు. గతంలో ఇసుక

నిరసన తెలుపుతున్న కార్మికులు, ట్రాక్టర్ యజమానులు

ఆటంకం వల్ల అనేకమంది కార్మికులు ఉపాధి కోల్పోయారని, భవన నిర్మాణాలు, పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో పనులకు ఆటంకం లేకుండా ఉండాలంటే మండలంలో అన్ని ఇసుక రీచ్ల వద్ద నుండి ఇసుక తరలింపునకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం ఎల్లవేళలా అందుబాటులో ఉండే నీకే మేము స్వచ్ఛంద సంస్థ సభ్యులు. వివరాల్లోకి వెళ్తే విశాఖ, పద్మనాభం మండలం బొత్సపేటకు చెందిన కొండమ్మ, ఆదినారాయణ దంపతుల కొడుకు జగదీష్ వృత్తిరీత్యా రోజువారి కూలీగా పెయింటింగ్ పనికి వెళ్లడంతో అక్కడ విద్యుత్ షాక్‌కు గురై పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వెంటనే హాస్పిటల్లో చేర్చారు. ఆపరేషన్ చేసి తన ఎడమ కాలును తొలగించారు. కుడి చేతికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం మరికొన్ని చికిత్సలు నిమిత్తం రూ.3 లక్షల వరకు ఖర్చవ్వడంతో ఇంకా వైద్యం చేయాలని వైద్యులు తెలియజేయడంతో పేదరికం వల్ల ఆర్థిక స్థోమత సరిపోక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం మీకై.. మేము వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థను గాయపడ్డ వ్యక్తి బంధువులు ఆశ్రయించారు. దీనికి సంస్థ సభ్యులు స్పందించి రూ.10వేలు ఆర్థికసాయాన్ని విజయనగరం వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆపదలో వుండే వారికి తోడ్పాటును అందించాలనే ఇటువంటి సంస్థలు ముందుకు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. మీకై మేము వెల్ఫేర్ అధ్యక్షులు దిలీప్ మాట్లాడుతూ ఆపదలో వున్న వ్యక్తులకు సమాజంలో వుండే అందరూ తమకు తోచినంత సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు విజయనగరం ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ నాగేశ్వరరావు, మాతృభూమి సేవా సంఘం నాయకులు గోపాలరావు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం

ప్రజాశక్తి - సీతానగరం

పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులు శతశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కష్టపడి పనిచేస్తున్నారని ఉమ్మడి జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల కోఆర్డినేటర్ ఎస్ రూపవతి తెలిపారు. మండలంలోని జోగింపేట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాయాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. జిల్లాలోని ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు 360 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 287 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 223 మంది విద్యార్థులు

విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్ చెబుతున్న రూపవతి

హాజరుకానున్నారని చెప్పారు. గురుకులాల్లో అన్ని విద్యాసంస్థల్లో ప్రణాళికబద్ధంగా విద్యను చెప్పడంతో పాటు మంచి ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కూడా చక్కగా చదువుతున్నారని చెప్పారు. జోగింపేట పాఠశాలలో వంటసాలను, వంటలను, మైదానాన్ని, తరగతులను, విద్యార్థులు ప్రదర్శనలను ఆమె పరిశీలించారు. పాఠశాల వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నుంచి జిల్లాలోని అన్ని గురుకులాల్లో చికెన్ పెట్టాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. బర్డ్ ఫ్లూ కారణంగా నిలిపివేసి తిరిగి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెవిఎస్ మధు, సీనియర్ లెక్చరర్ ఈశ్వరరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సమగ్రాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

అంగన్వాడీల్లో పిల్లల సమగ అభివృద్ధిపై అంగన్వాడీ వర్కర్లకు సమగ్ర శిక్షణ ఇస్తున్నట్టు ఐసిడిఎస్ సిడిపిఒ కె.విజయగౌరి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ విజయగౌరి మాట్లాడుతూ సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మూడు రోజులు అంగ న్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా అంగన్వాడీ వర్కర్లకు పిల్లల సమగ్ర అభివృద్ధి, పిల్లలు ఎలా నేర్చుకుంటారు, పిల్లలకు ఎలా నేర్పించాలి, వాళ్ల అభివృద్ధిలో శారీరక, మానసిక, మేధాభివృద్ధి, సాంఘిక అభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిపిసి యూనిట్ ఇన్చార్జి సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ భవాని, సూపర్‌వైజర్లు రాజేష్, శ్రావణి, ముకుందరావు, అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు సరోజ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిడిపిఒ విజయగౌరి

కార్యక్రమాన్ని సోమవారం సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త రెడ్డి తెజేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అంగన్వాడీ టీచర్లు పిల్లల్లో ఉన్న మేధాశక్తిని, శారీరక శక్తిని, ఆలోచన శక్తిని, భాషా నైపుణ్యాలను సామాజిక భావుద్వేగా అభివృద్ధిని, సామాజిక కళా నైపుణ్యతను పిల్లల్లో పెంపొందించడంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ కొండలరావు, హెచ్ఎం ఎస్ పాత్రుడు, డిఆర్‌పిఎస్‌లు వి.ధనుంజయనాయుడు, పి.వెంకటనాయుడు, కె.సింహాచలం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎ.లక్ష్మి, ఎపిఒ వైఆర్ బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దుపై పోస్ట్ కార్డు ఉద్యమం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ వెల్లడి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మంత్రి వర్గ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తామని చేసిన నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సాలూరు పట్టణంలో ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ద్వారా లేఖలు రాసి మెయిన్ రోడ్‌లో ఉన్న పోస్ట్ ఆఫీస్ బాక్స్‌లో వేసి నిరసన తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, శంకర్రావు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్తారని, అప్పుడు జీతాలు పూర్తిస్థాయిలో కాంట్రాక్టర్ ఇవ్వడని, పిఎఫ్, ఇఎస్ఐ కూడా గ్యారెంటీ ఉండదని, ఆప్కాస్ రాకపూర్వం ఇదే జరిగిందని తెలిపారు. ఎన్నికల్లో హామీ

పోస్టుకార్డులను బాక్సులో వేస్తున్న వర్కర్స్

ప్రకారం కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక సమస్యలపై చర్చించాలని, లేకపోతే భవిష్యత్తులో ఆందోళన సిద్ధపడతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరిబాబు, పార్వతి, శ్రీను ,పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

పీసా చట్టంపై సచివాలయ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని జిల్లా పరిషత్ సిఇఒ ఆర్.వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ జె.ఉమ మహేశ్వరి ఆధ్వర్యంలో పీసా చట్టంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జెడ్‌పి సిఇఒ మాట్లాడుతూ పీసా-2011 చట్టం ప్రకారం 7 రకాల పీసా విధులు, బాధ్యతలు ఉన్నాయని, ఇవన్నీ సచివాలయ సిబ్బంది సమగ్రంగా తెలుసుకొని గిరిజన గ్రామాల్లో గిరిజన ప్రజలకు ఈ చట్టం, హక్కులు విధులపై అవగాహన కల్పిస్తూ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.రవణమ్మ, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి గొర్లి సుజాత, సిడిపిఒ కె.విజయగౌరి, మండలంలో గల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పీసా చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సిఇఒ

మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకటరమణ

ఆర్.వెంకటరమణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న పీసా చట్టంపై శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సచివాలయం ఉద్యోగులకు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పీసా చట్టం హక్కులు, విధులు విధి విధా నాలతో గిరిజన గ్రామాలను, ప్రజలను అభివృద్ధి దిశగా నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్‌రాజు ఉన్నారు.

వేతనదారులు ఇష్ట ప్రకారమే మేట్ల నియామకం

ప్రజాశక్తి - భామిని

ఉపాధి హామీ వేతనదారుల ఇష్టప్రకారమే మేట్లను నియమించాలని ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బాలేరులో ఉపాది హామీ వేతనదారులతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు ఇష్ట ప్రకారమే, నిబంధనల మేరకు మేట్లను నియమించాలని కోరారు. ప్రతిరోజు కనీస వేతనం రూ.300 వచ్చేలా చూడాలని కోరారు. ఉపాధి హామీ పనులు ఒక పూట మాత్రమే నిర్వహించాలని, ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉందని తెలిపారు. బాలేరులోని ఉపాధి హామీ వేతనదారులు నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి గున్నమ్మ చెరువులో పనులు చేస్తున్నారని, ప్రతిరోజూ రెండు పూటలు వెళ్లడం

కూలీలతో మాట్లాడుతున్న ఎంపిటిసి చంద్రశేఖర్

కష్టంగాఉ ందన్నారు. మెట్లను ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేయలేదని, ఇలా అయితే ఎలా అని తెలిపారు. వేతనదారులు ఇష్ట ప్రకారం మెట్ల నియమిస్తే సాంకేతిక పనులు కూడా త్వరితంగా అవుతాయని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మెడిబోయిన చలపతిరావు, ఉపాధి హామీ వేతనదారులు ఉన్నారు.

ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు

ప్రజాశక్తి - కొమరాడ

మహా శివరాత్రి సందర్భంగా గుంప సోమేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు పార్వతీపురం రూరల్ సిఐ ఎస్ గోవిందరావు అన్నారు. సోమవారం నాగావళి జంఝావతి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వ రస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం, ఆలయ పరిసర ప్రాంతాలను సిఐకి వివరించి పోలీస్ బందోబస్తు ఏర్పాటుపై చర్చించారు. భక్తులకు ఎటు వంటి క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

సిఐకు బందోబస్తు గురించి వివరిస్తున్న ఎస్ఐ

దర్శనం అనంతరం ఇబ్బం దులు లేకుండా బయటకు వచ్చేందుకు ఏర్పాట్లపై సిఐ ఆరా తీశారు. ముఖ్యంగా శివరాత్రి సందర్భంగా రెండు రోజులు పాటు వేల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అల్లర్లు, తగాదాలు, గొడవలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఇఒ ప్రసాద్‌ను కోరారు. ఈ పరిశీలనలో పోలీస్ సిబ్బంది, దేవాదాయ శాఖ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.